పశువులతో పరేషాన్!

- రోడ్లపై తిష్టవేస్తున్న మూగజీవాలు
- ప్రజల రాకపోకలకు తీవ్ర ఇక్కట్లు
- ఇటీవల మంత్రి రోడ్‌షోలోనూ బీభత్సం
- ప్రమాదాలు జరుగుతున్నా పట్టించుకోని అధికార యంత్రాంగం


చెన్నూర్‌లోని పాత బస్టాండ్ ప్రాంతంలో రోడ్ల పై సంచరిస్తున్న పశువులు


చెన్నూర్ రాజీవ్‌రోడ్డుపై పశువు

చెన్నూర్: మున్సిపాలిటీలోని ప్రధాన రహదారుల్లో పశువులు సంచారం ప్రమాదాలకు నెలవుగా మారింది. విచ్చలవిడిగా పశువులు సంచరించడంతో ప్రయాణికులు, పాదాచారులు ప్రమాదాల బారిన పడుతున్నారు. ఇటీవల వైద్య ఆరోగ్య శాఖ మంత్రి హరీశ్‌రావు రోడ్డు షో సభ వద్ద ఎద్దు బీభత్సం సృష్టించింది. ఈ ఘటనలో నలుగురు మహిళలతో పాటు మరో ఇద్దరికి గాయాలయ్యాయి. రాత్రి వేళల్లో రోడ్ల పైనే పశువులు పడుకొని ఉండడంతో వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారు. మూగజీవాల సంచారంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నా అధికార యంత్రాంగం పట్టించుకోవడం లేదని ప్రజలు ఆరోపిస్తున్నారు.

ప్రధానంగా..

మున్సిపాలిటీ పరిధిలోని జలాల్ పెట్రోల్‌బంక్ నుంచి అయ్యప్ప దేవాలయం, కొత్త బస్టాండ్, మారుతీ హనుమాన్ మందిర్, పాత బస్టాండ్, గాంధీచౌక్ రాజీవ్‌రోడ్డు, మార్కెట్ ఏరియాల్లో జన సంచారం రద్దీగా ఉంటుంది. ఈ ప్రాంతాలలోనే పశువులు ఇష్టారాజ్యంగా తిరుగుతుండడంతో అన్నివర్గాల ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. పాఠశాలకు వెళ్లే విద్యార్థులు పశువులు ఎక్కడ దాడి చేస్తాయో అని భయాందోళన చెందుతున్నారు.

యజమానుల నిర్లక్ష్యంతోనే...

పశుసంపదను కాపాడుకోవాల్సిన యజమానుల నిర్లక్ష్యం కారణంగానే రోడ్లపై సంచరిస్తున్నాయని ఆరోపణలు విన్పిస్తున్నాయి. మూగజీవాలను ఇళ్లలో ఉంచుకోవాల్సి ఉండగా, విచ్చలవిడిగా వదిలేస్తున్నారు. దీంతో రోడ్లపై సంచరించడంతో ప్రమాదాలకు కారణమవుతున్నాయి. యజమానులు సక్రమంగా మూగజీవాలను ఇళ్లలో ఉంచుకున్నట్‌లైతే ప్రమాదాలను అరికట్టవచ్చని ప్రజలు అంటున్నారు. మున్సిపల్ అధికారులు యజమానులతో సమావేశం ఏర్పాటు చేసి రోడ్లపై పశువుల సంచారాన్ని అరికట్టాలని కోరుతున్నారు.

పశువుల సంచారాన్ని నియంత్రిస్తాం



రోడ్లపై పశువుల సంచారం ఎక్కువ ఉన్న విషయం తెలిసింది. యజమానులు రోడ్లపై పశువులను సంచరించకుండా చూడాలి. ప్రత్యేక సిబ్బందిని ఏర్పాటు చేసి రోడ్లపై సంచరించే పశువులను బయటికి పంపించే విధంగా చర్యలు తీసుకుంటాం.
– గంగాధర్, మున్సిపల్ కమిషనర్

కలెక్టరేట్‌లో మద్యం స్టిక్కర్ కలకలం

మంచిర్యాలక్రైం: జిల్లా కేంద్రంలో నూతనంగా ఏర్పాటు చేసిన జిల్లా సమీకృత కలెక్టరేట్ కార్యాలయంలో మద్యం స్టిక్కర్ కలకలం రేపింది. కలెక్టరేట్ కార్యాలయంలోని రెండో ఫ్లోర్‌లో వీఐపీల కోసం ఏర్పాటు చేసిన రూమ్ నంబర్ ఎఫ్20 టాయిలెట్ రూమ్‌లో ఎవరో మద్యం బాటిల్‌కు ఉన్న సీల్ట్ స్టిక్కర్‌ను గోడకు అంటించగా 'సాక్షి' క్లిక్ మనిపించింది. కలెక్టర్ కార్యాలయం అంటేనే భారీ భద్రతతో ఉండాల్సింది. ఎవరు వస్తున్నారు... ఎవరు వెళ్తున్నారు అనేది పూర్తి స్థాయిలో నిఘా నీడలో ఉన్న కలెక్టర్ కార్యాలయంలోకి మద్యం స్టిక్కర్ ఎలా వచ్చిందనేది చర్చనీయాంశమైంది. మద్యం స్టిక్కర్ ఎక్కడో కలెక్టర్ ప్రాంగణంలో.. ఎక్కడో ఓ మూలకు అనుకుంటే వేరుగా ఉండేది. కానీ రెండో ఫ్లోర్‌లో వీఐపీల కోసం ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన టాయిలెట్స్ రూములో మద్యం స్టిక్కర్ దర్శనమివ్వడంపై సర్వత్రా విమర్శలకు తావిస్తోంది. ఎన్నికల కోడ్ ఉన్నందునా కలెక్టర్ కార్యాలయానికి భారీ భద్రత పెంచాల్సిన అవసరం ఉందని పలువురు కోరుతున్నారు.


వీఐపీ టాయిలెట్‌లో మద్యం స్టిక్కర్

ఎన్నికల విధులు సక్రమంగా నిర్వర్తించాలి

బెల్లంపల్లి: అసెంబ్లీ నియోజకవర్గం బెల్లంపల్లిలో ఎన్నికల ప్రవర్తన నియమావళిలో భాగంగా ప్రతీ అధికారి విధులను సక్రమంగా నిర్వర్తించాలని అసెంబ్లీ ఎన్నికల రిటర్నింగ్ అధికారి రాహుల్ సూచించారు. స్థానికంగా బుధవారం ఎన్నికల అధికారులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎంసీసీ, ఎఫ్ఎస్‌టీ, ఎస్ఎస్‌టీ, వీవీటీ, వీఎస్‌టీ టీమ్‌లలో విధులు నిర్వర్తించే అధికారులు, సెక్టోరల్ అధికారులు అత్యంత బాధ్యతాయుతంగా పనిచేయాల్సి ఉంటుందన్నారు. కేటాయించిన, నిర్వర్తించాల్సిన విధుల గురించి వివరించారు. అసెంబ్లీ నియోజకవర్గంలో క్షేత్రస్థాయి పరిశీలన చేసి వాల్‌పోస్టర్లు, గోడల మీద రాయించిన రాతలను తొలగించాలని ఆదేశించారు. ఎన్నికల ప్రవర్తన నియమావళిని ఉల్లంఘించిన వారిపై ప్రజాప్రాతినిధ్య చట్టం ప్రకారం చర్యలు తీసుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో తహసీల్దార్ సుధాకర్, మున్సిపల్ కమిషనర్ సమ్మయ్య, ఇతర అధికారులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఎన్నికల రిటర్నింగ్ అధికారి రాహుల్

ఎన్‌సీసీ క్యాంపులో విద్యార్థుల ప్రతిభ

జన్నారం: 32వ బెటాలియన్ ఆదిలాబాద్ ఎన్‌సీసీ క్యాంపులో భాగంగా ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలో పది రోజుల పాటు నిర్వహించిన ఎన్‌సీసీ క్యాంపులో 600మందిలో పాల్గొని జన్నారం మండలం స్లేట్ హైస్కూల్‌కు చెందిన పలువురు విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. జేడబ్ల్యూ విభాగంలో తొమ్మిదో తరగతి చదువుతున్న మేతరి కీర్తన డ్రిల్లింగ్ విభాగంలో మొదటి ర్యాంకు సాధించినట్లు హెచ్‌ఎం శ్రీకాంత్‌రెడ్డి తెలిపారు. జాజల దియా, సోనాలి ఆర్‌డీసీ మొదటి కాంపిటీషన్ ముగించుకుని, రెండో కాంపిటీషన్‌కు ఎంపికయ్యారని తెలిపారు. ఇందులో ఆరు విభాగాలుంటాయని ఆరు విభాగాలు పూర్తి చేసుకున్నవారికి జనవరి 26న ఢిల్లీలో నిర్వహించే పరేడ్‌కు ఎంపికవుతారని పేర్కొన్నారు. ఫైరింగ్ విభాగంలో లసిక, సైనిక, సహస్ర, ఆంజనేయ విధాత్రి, సోనాలిలు మొదటి ర్యాంకు సాధించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులను హెచ్ఎం, వైస్ ప్రిన్సిపాల్ పూజ, ఉపాధ్యాయ సిబ్బంది అభినందించారు.


సర్టిఫికెట్లతో, మెడల్స్‌తో విద్యార్థులు

మూఢ నమ్మకాలపై అవగాహన

చెన్నూర్‌రూరల్/తాండూర్: మూఢ నమ్మకాలను నమ్మి జీవితాలను అంధకారం చేసుకోవద్దని తాండూర్ సీఐ కె.శ్రీనివాసరావు సూచించారు. తాండూర్ మండలంలోని కొత్తపల్లిలో, చెన్నూర్ మండలం పొక్కూర్‌లో సీఐ వాసుదేవరావు ఆధ్వర్యంలో పోలీసు కళాజాత బృందంతో అవగాహన కల్పించారు. సాంఘీక దురాచారాలు, మూఢనమ్మకాల వల్ల జరిగే అనర్థాలపై ఆటపాటలతో వివరించారు.

పోలీసుల తనిఖీలు


గూడెం వద్ద వాహన తనిఖీల్లో సీఐ కృష్ణ

దండేపల్లి: ఎన్నికల నేపథ్యంలో దండేపల్లి మండలం గూడెం అటవీ చెక్‌పోస్ట్ వద్ద పోలీసులు వాహన తనిఖీలు ముమ్మరం చేశారు. బుధవారం రాత్రి లక్సెట్టిపేట సీఐ కృష్ణ, దండేపల్లి ఎస్సై ప్రసాద్ ఆధ్వర్యంలో వాహనాలు తనిఖీ చేశారు. డబ్బు, మద్యం తరలింపుపై ప్రత్యేక దృష్టిపెట్టారు. నగదు తీసుకెళ్లే వారు రూ.50వేలు దాటితే, వాటికి సంబంధించిన ధ్రువపత్రాలు వెంట ఉంచుకోవాలని సీఐ సూచించారు. పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

కాంగ్రెస్ యూత్ కమిటీ ప్రధాన కార్యదర్శిగా రమేశ్


నియామకపత్రం ఇస్తున్న సురేఖ

భీమారం: చెన్నూరు నియోజకవర్గం యూత్ కాంగ్రెస్ కమిటీ ప్రధాన కార్యదర్శిగా భీమారం గ్రామానికి చెందిన అర్కాల రమేశ్‌ను నియమించారు. ఈ మేరకు బుధవారం డీసీసీ అధ్యక్షురాలు కొక్కిరాల సురేఖ నియామకపత్రాన్ని అందజేశారు. రానున్న ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీని అధికారంలోకి తెచ్చేందుకు కృషి చేస్తానని అర్కాల రమేశ్ తెలిపారు.

వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమం సందర్శన

మంచిర్యాలరూరల్(హాజీపూర్): హాజీపూర్ మండలం గడ్పూర్ ఆరోగ్య ఉపకేంద్రంలో చిన్నారులకు నిర్వహిస్తున్న వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమాన్ని మంచిర్యాల డివిజన్ వైద్య, ఆరోగ్య శాఖా అధికారులు పరిశీలించారు. వ్యాక్సిన్ క్యారియర్‌లోని టీకా మందులను, హబ్ కట్టర్, ఏఈఎఫ్ఐ కిట్, సంబంధిత రిజిస్టర్‌లను సీహెచ్‌ఓ రామ్మూర్తి, హెల్త్ ఎడ్యుకేటర్ అల్లాడి శ్రీనివాస్, సబ్ యూనిట్ అధికారి నాందేవ్ సంయుక్తంగా పరిశీలించి పలు సూచనలు చేశారు.

క్లుప్తంగా

పంటల పరిశీలన


పంటను పరిశీలిస్తున్న కల్పన

చెన్నూర్‌రూరల్: మండలంలోని పొక్కూర్‌లో పంటలను జిల్లా వ్యవసాయ అధికారిని కల్పన బుధవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రస్తుత పంటసాగులో తీసుకోవాల్సిన సస్యరక్షణ చర్యల గురించి రైతులకు అవగాహన కల్పించారు. సేంద్రీయ సాగు విధానంపై వివరించారు. ఆమె వెంట ఎంఏవో కవిత, ఏఈవో సాగర్, రాజశేఖర్ తదితరులు ఉన్నారు.

కాంగ్రెస్ గ్యారెంటీ పథకాలపై ప్రచారం

భీమారం: మండలంలోని పోలంపల్లిలో కాంగ్రెస్ పార్టీ ప్రకటించిన ఆరు గ్యారెంటీ పథకాలపై బుధవారం పీసీసీ ప్రధాన కార్యదర్శి పిన్నింటి రఘునాథరెడ్డి ప్రచారం నిర్వహించారు. ఈ మేరకు ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే ఆరు గ్యారెంటీ పథకాల వల్ల మహిళలకు ఎంతో మేలు జరుగుతుందన్నారు. ప్రతి మహిళకు రూ.2500, రూ.500కే గ్యాస్ అందించడం లాంటి పథకాలు అందుతాయన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రజలను మోసం చేస్తుందన్నారు. ఈ ఎన్నికల్లో వారికి ప్రజలు ఓట్ల ద్వారా బుద్ధిచెబుతారన్నారు. ఇందులో నాయకులు నూకల రమేశ్, అర్కాల రమేశ్ రాంచెందర్ పాల్గొన్నారు.

మంచిర్యాల ఎల్ఐసీ ఏబీఎంగా మల్లేష్


శుభాకాంక్షలు తెలుపుతున్న సిబ్బంది

మంచిర్యాలక్రైం: మంచిర్యాల ఎల్ఐసీ అసిస్టెంట్ బ్రాంచ్ మేనేజర్‌గా గోపతి మల్లేష్ బుధవారం బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా బ్రాంచ్ సీఎం విశ్వేశ్వర్ శుభాకాంక్షలు తెలిపారు. మల్లేష్ మాట్లాడుతూ ఎల్ఐసీ ఏజెంట్ల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో అడ్మిన్ మేనేజర్ భారతి, లక్సెట్టిపేట, చెన్నూర్ బ్రాంచ్ మేనేజర్లు మార్కండేయ శశిశేఖర్, డెవలప్‌మెంట్ ఆఫీసర్లు, ఎల్ఐసీ ఏజెంట్ యూనియన్ నాయకులు పూర్ణచందర్, వాసు, సాగర్, రాజబాబురెడ్డి, ఏజెంట్లు పాల్గొన్నారు.

డీఎల్‌పీవో పర్యటన

దండేపల్లి: మండలంలోని మేదరిపేటను డీఎల్‌పీవో ప్రభాకర్‌రావు బుధవారం సందర్శించారు. పారిశుద్ధ్యం లోపించకుండా చూడాలని, పంచాయతీ సిబ్బందికి సూచించారు. పలు దుకాణాల ఎదుట చెత్తవేయడంతో, సంబంధిత దుకాణ యజమానులకు జరిమానా విధించారు. చెత్తను రోడ్లపై వేయొద్దని, పంచాయతీ చెత్తట్రాక్టర్ వచ్చినప్పుడు అందులో మాత్రమే వేయాలన్నారు. చెత్తను ఎక్కడపడితే అక్కడ పడేసి, పరిసరాలను కలుషితం చేయొద్దన్నారు.

బీజేపీ కార్యాలయం ప్రారంభం


ప్రారంభిస్తున్న రఘునాథ్

లక్సెట్టిపేట: మండల కేంద్రంలో అంబేద్కర్ చౌక్ సమీపంలో బీజేపీ కార్యాలయాన్ని జిల్లా అధ్యక్షుడు రఘునాథ్ బుధవారం ప్రారంభించారు. రాబోవు ఎన్నికల దృష్ట్యా పార్టీ కార్యాలయాన్ని ప్రారంభించినట్లు తెలిపారు. కార్యకర్తలు పార్టీ బలోపేతానికి కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో మండలాధ్యక్షుడు కిషన్, పట్టణాధ్యక్షుడు హరిగోపాల్, నాయకులు రజనీష్ నరేష్‌చంద్, పాల్గొన్నారు.

ఎన్నికల నియమావళి అమలు చేయాలి

చెన్నూర్: పట్టణంలో అధికారులు ఎన్నికల నియమావళిని సక్రమంగా అమలు చేయాలని డిమాండ్ చేస్తూ బీజేపీ పట్టణ అధ్యక్షుడు సుశీల్‌కుమార్ ఇన్‌చార్జి రిటర్నింగ్ అధికారికి వినతిపత్రం అందజేశారు. ఎన్నికల నిబంధనల ప్రకారం ఇంటి గోడపై ఉన్న పార్టీ గుర్తులను, ఇంటి యజమాని అనుమతి లేకుండా తుడిచి వేయొద్దన్నారు. నా అనుమతి లేకుండా నా ఇంటి గోడకు ఉన్న, కమలం పువ్వు గుర్తును సిబ్బంది తొలగించారని పేర్కొన్నారు. పట్టణంలో ప్రధాన రహదారుల్లో అధికార పార్టీ జెండాలు, ఫ్లెక్సీలు ఉన్నప్పటికీ, వాటిని తొలగించకుండా మున్సిపల్ సిబ్బంది అధికార పార్టీకి తొత్తులుగా మారారని ఆరోపించారు. ఎన్నికల అధికారులు ఈ విషయంపై విచారణ జరిపి ఒక పార్టీకి వత్తాసు పలికే సిబ్బంది, అధికారులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పట్టణ ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్, నాయకులు వంశీ, శివ, కృష్ణ, సంతోశ్, సంజయ్, అక్షిత్‌శర్మ, సుధాకర్ పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

పోలింగ్ కేంద్రాల పరిశీలన

లక్సెట్టిపేట: అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో లక్సెట్టిపేట మున్సిపాలిటీ పరిధి, మండలంలోని పలు గ్రామాల్లో గల పోలింగ్ కేంద్రాలను లక్సెట్టిపేట సీఐ కృష్ణ, ఎస్సై లక్ష్మణ్, బుధవారం పరిశీలించారు. పోలింగ్ కేంద్రాల్లో విద్యుత్ సౌకర్యం, వృద్ధులు, దివ్యాంగులకు ర్యాంపులు సౌకర్యంతో పాటు, సమస్యలు ఉన్నాయా అనే వివరాలపై ఆరా తీశారు.

ట్రైనర్ నియామకం

లక్సెట్టిపేట: పట్టణానికి చెందిన విజయ్‌కుమార్ పర్సనాలిటీ డెవలప్‌మెంట్ మోటివేషనల్ ట్రైనర్‌గా నియామకం అయినట్లు హైదరాబాద్‌కు చెందిన ఇంపాక్ట్ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు గంప నాగేశ్వర్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా ట్రైనర్‌గా ఎంపికై విద్యార్థులకు మంచి కెరీర్‌ను అందించాలని కోరారు. మంచిర్యాలలో నిర్వహించిన సమావేశంలో ధ్రువీకరణ పత్రాన్ని అందించినట్లు తెలిపారు. కార్యక్రమంలో ప్రొఫెసర్ విశ్వనాథం సభ్యులు పాల్గొన్నారు.

ఉపకార వేతనాలకు ఎంపిక

మందమర్రిరూరల్: మండల కేంద్రంలోని మోడల్ స్కూల్‌లో ఇంటర్మీడియేట్‌లో అత్యుత్తమ మార్కులు సాధించిన 20మంది విద్యార్థులు కేంద్ర మానవ వనరుల అభివృద్ధి శాఖ (ఎంహెచ్‌డీఆర్) ఉపకార వేతనాలకు ఎంపికయ్యారని స్కూల్ ప్రిన్సిపల్ జయకృష్ణారెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపికైన విద్యార్థులకు పై చదువు నిమిత్తం ఆ శాఖ రూ.70వేలు అందిస్తుందని పేర్కొన్నారు.

కాసిపేట: మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలకు చెందిన ఇద్దరు విద్యార్థినులు ఎంహెచ్‌డీఆర్‌కు ఎంపిక కాగా బుధవారం కళాశాల ప్రిన్సిపాల్ జ్యోతికుమార్, అధ్యాపకులు విద్యార్థులను సన్మానించారు.

గద్దర్ సంస్మరణ సభ

పాతమంచిర్యాల: నస్పూర్‌లో గద్దర్ సంస్మరణ సభను ఈ నెల 15న నిర్వహిస్తున్నట్లు భారత్ బచావో జిల్లా చైర్‌పర్సన్ కనుకుంట్ల మల్లయ్య తెలిపారు. ఈ సందర్భంగా సంస్మరణ సభ పోస్టర్లను జిల్లా కేంద్రంలో ఆవిష్కరించారు. సంస్మరణ సభకు భారత్‌బచావో జాతీయ కార్యదర్శి గాదె ఇన్నయ్య, బహుజన వాది జేబీ రాజు, భారత్ బచావో రాష్ట్ర నాయకులు ప్రజా ఉద్యమకారులు పాల్గొంటారని తెలిపారు.

ఘనంగా అంతర్జాతీయ బాలికల దినోత్సవం

మంచిర్యాలఅర్బన్: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అంతర్జాతీయ దినోత్సవ వేడుకలు బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ చక్రపాణి మాట్లాడుతూ విద్యార్థినుల హక్కులు, ఆరోగ్యంపై శ్రద్ధ సమాజంలో రాణించాల్సిన బాధ్యతలపై వివరించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ పట్వర్ధన్, ఉమెన్ ఎంపవర్మెంట్ సెల్ ఇన్‌చార్జి ప్రేమలత తదితరులు పాల్గొన్నారు.

పిచ్చి మొక్కలు తొలగింపు

మందమర్రిరూరల్: మందమర్రి ఏరియాలోని ఎస్అండ్‌పీసీ ఆఫీస్ ఆవరణలో బుధవారం సిబ్బంది శ్రమదానం చేసి పిచ్చిమొక్కలు తొలగించి, పరిసరాలు శుభ్రం చేశారు. కార్యక్రమంలో సెక్యూరిటీ ఆఫీసర్, సీనియర్ ఇన్స్‌పెక్టర్ సుంకరి రమేష్, జూనియర్ ఇన్స్‌పెక్టర్ సుధాకర్, జమేదార్ లక్ష్మణ్, ఎస్ అండ్ పీసీ సిబ్బంది, ప్రైవేట్ సెక్యూరిటీ గార్డులు ఉన్నారు.

■ బొగ్గుబాయి వార్తలు

13న 'చలో ప్రగతి భవన్'



మాట్లాడుతున్న పేరం రమేశ్

శ్రీరాంపూర్: సింగరేణిలో కాంట్రాక్ట్ కార్మికుల సమస్యలపై ఈ నెల 13న చలో ప్రగతిభవన్ కార్యక్రమం చేపట్టినట్లు సింగరేణి కాంట్రాక్టు లేబర్ యూనియన్ సెంట్రల్ ఉపాధ్యక్షుడు పేరం రమేష్ తెలిపారు. నస్పూర్–శ్రీరాంపూర్ ప్రెస్‌క్లబ్‌లో బుధవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సింగరేణి కాంట్రాక్టర్ కార్మికులకు ముఖ్యమంత్రి కేసీఆర్ ఇచ్చిన హామీలను అమలు చేయాలన్నారు. బొగ్గు ఉత్పత్తి, ఉత్పాదకతలో కాంట్రాక్ట్ కార్మికులు ఎంతో శ్రమిస్తున్నారని తెలిపారు. సింగరేణిలో 30వేల మంది కాంట్రాక్ట్ కార్మికుల పనిచేస్తున్నారని, వారి శ్రమకు తగ్గ ప్రతిఫలం రావడం లేదని ఆరోపించారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు రఘునాథ్ రావు ఆధ్వర్యంలో చలో ప్రగతిభవన్ కార్యక్రమాన్ని చేపట్టినట్లు తెలిపారు. సింగరేణిలో పనిచేస్తున్న కాంట్రాక్ట్ కార్మికులంతా పెద్ద సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు. ఈ సమావేశంలో ఆ యూనియన్ శ్రీరాంపూర్ ఏరియా ఇన్‌చార్జి మిట్టపల్లి మొగిలి, నాయకులు సత్రం రమేష్, కొండ వెంకటేష్, వినోద్ కుమార్, అంబాలసాగర్, రణవేణి శ్రీనివాస్, బద్రి శ్రీకాంత్ రవీందర్ పాల్గొన్నారు.

మ్యాన్‌రైడింగ్ పనులు వేగవంతం చేయండి


కాసిపేట 2గనిని సందర్శించిన జీఎం మనోహర్, అధికారులు

కాసిపేట: మందమర్రి ఏరియా కాసిపేట 2గనిలో మ్యాన్‌రైడింగ్ పనులను వేగవంతం చేయాలని మందమర్రి ఏరియా జీఎం మనోహర్ అధికారులకు సూచించారు. కాసిపేట 2గనిని బుధవారం సందర్శించి పనిస్థలాలు తనిఖీ చేశారు. గనిలో కొనసాగుతున్న వైర్‌లిఫ్ట్ మ్యాన్‌రైడింగ్ పనులను సమీక్షించారు. ఉద్యోగుల సౌలభ్యం, భద్రతకు పనులు త్వరగా పూర్తి చేయాలన్నారు. కార్యక్రమంలో ఏజీఎం ఈఅండ్ఎం ఇంజనీర్ నాగరాజు, గ్రూప్ ఏజెంట్ రాందాస్, గ్రూప్ ఇంజనీర్ రాంప్రసాద్, మేనేజర్ లక్ష్మినారాయణ, అధికారులు పాల్గొన్నారు.

అలరించిన స్వాగతోత్సవం



ఫ్రెషర్స్ డే వేడుకల్లో పాల్గొన్న విద్యార్థినులు

మంచిర్యాలఅర్బన్: స్థానిక లయన్స్‌క్లబ్ ఫంక్షన్ హాల్‌లో మంచిర్యాల వొకేషనల్ (వృత్తి విద్యా)కళాశాల, శ్రీ సాయి పారా మెడికల్ కళాశాలల ఆధ్వర్యంలో బుధవారం ఫ్రెషర్స్ పార్టీ ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థుల ఆటపాటలు ఎంతగానో అలరించాయి. కళాశాలల చైర్మన్ డాక్టర్ పి.శ్రీనివాస్ మాట్లాడుతూ.. ఫ్రెషర్స్ పార్టీ లాంటి కార్యక్రమం నిర్వహించటం ద్వారా విద్యార్థుల మధ్య సోదరభావం పెంపొందుతాయన్నారు. విద్యార్థులు క్రమశిక్షణతో ఇష్టపడి చదువుతూ, ఉన్నతస్థాయికి ఎదగాలని సూచించారు. కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ శ్రీదేవి, డైరెక్టర్లు మహాలక్ష్మి, ఆదిత్య, సుధారాణి, సౌమ్య, రాకేష్ తదితరులు పాల్గొన్నారు.

అక్కడ అలా..!


రాజీవ్‌గాంధీ విగ్రహానికి ముసుగువేస్తూ...

నస్పూర్: రాష్ట్రంలో ఎన్నికల కోడ్ అమలులోకి రావడంతో పట్టణంలోని ఫ్లెక్సీలను మున్సిపల్ సిబ్బంది తొలగిస్తున్నారు. రాజకీయ నాయకుల విగ్రహాలకు ముసుగులు తొడుగుతున్నారు. సీసీసీ కార్నర్ వద్ద మాజీ ప్రధాని రాజీవ్‌గాంధీ విగ్రహానికి మున్సిపల్ సిబ్బంది ముసుగు తొడిగారు.

ఇక్కడ ఇలా..!


విగ్రహానికి ముసుగు వేయకుండా..

దండేపల్లి: ఎన్నికల కోడ్ అమలులో ఉన్నప్పుడు, రాజకీయ నాయకుల విగ్రహాలకు ముసుగులు వేస్తారు. కానీ దండేపల్లి మండలం మేదరిపేట బస్టాండ్‌లో గల ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ఉప ముఖ్యమంత్రి దివంగత జేవీ నర్సింగరావు విగ్రహానికి అధికారులు ఇంకా ముసుగు వేయలేదు.

'అవకాశం ఇవ్వండి.. అభివృద్ధి చేసి చూపిస్తా'


మాట్లాడుతున్న ఏమాజీ

కాసిపేట: బెల్లంపల్లి ఎమ్మెల్యేగా ఒక్క అవకాశం ఇస్తే నియోజకవర్గాన్ని అభివృద్ధి చేసి చూపిస్తానని బీజేపీ నాయకుడు, బెల్లంపల్లి అసెంబ్లీ ఇన్‌చార్జి కొయ్యల ఏమాజీ కోరారు. మండలంలోని ధర్మరావుపేటలో బుధవారం గ్రామస్తులతో మాట్లాడి గ్రామంలోని సమస్యలు అడిగి తెలుసుకున్నారు. గత ఎమ్మెల్యే గ్రామానికి రాలేదని మహిళలు ఆగ్రహం వ్యక్తం చేశారని, అధికారం మీద తప్పితే ఎమ్మెల్యేకు అభివృద్ధి మీద శ్రద్ధ లేదన్నారు. బీఆర్ఎస్, కాంగ్రెస్‌లకు బుద్ధి చెప్పాలన్నారు. కేంద్రప్రభుత్వం, ప్రధాని మోదీ అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించి అవగాహన కల్పించారు. గ్రామస్తులు దేవ్‌సింగ్, గజానాన్ నాయక్, మహిళలు పాల్గొన్నారు.

'గడపగడపకూ పీఎస్ఆర్'

మంచిర్యాలక్రైం: పట్టణంలోని 2వ వార్డు దొరగారి పల్లెలో కాంగ్రెస్ పార్టీ డీసీసీ అధ్యక్షురాలు కొక్కిరాల సురేఖ గురువారం పర్యటించారు. గడప గడపకూ పీఎస్ఆర్ కార్యక్రమంలో భాగంగా కాంగ్రెస్ పార్టీ ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన ఆరు గ్యారంటీ హామీలు, పీఎస్ఆర్ నిర్వహిస్తున్న సేవా కార్యక్రమాలను ప్రజలకు వివరించారు. ఒక్కసారి అవకాశం ఇవ్వండి.. అండగా ఉంటామని కోరుతూ ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో వార్డు కౌన్సిలర్ సల్ల మహేష్, పట్టణ అధ్యక్షుడు తూమాల నరేష్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు తిరుపతి, కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

సరుకులు అందజేత

రామకృష్ణాపూర్: క్యాతనపల్లి మున్సిపాలిటీ పరిధిలోని 5వ వార్డు అమరవాది గ్రామానికి చెందిన అమ్మక్క, వెంకటస్వామి, అపర్ణలు ఇటీవల వేర్వేరు కారణాలతో మృతిచెందారు. వారి కుటుంబ సభ్యులకు బుధవారం బాల్కఫౌండేషన్ ఆధ్వర్యంలో సరుకులు అందించారు.